# బుడుగుతో ఇంటర్వ్యూ





"ఉరేయ్, బాబాయ్ వీడెవడో నన్ను హింట్రవ్యూ చేస్తాడుట. నేను చిన్నవాడినిగదా. కుంచెం బయ్యం వేస్తుందిగదా. నువ్వుకూడా రారా."

"ఎలా బుడుగూ బావుల్లావా? చాలా రోజుల్నించి కలబల్డం లేదుగదా. కాస్త జలుబు చేసిల్దికే?"

"బానే వుల్లాయిరా! మరి హింట్రవ్యూ ఏది? జటకా ఏనా, సైలింజనేనా తెచ్చావా?"

"నిన్ను ప్రశ్నలు కొన్ని అడుగుతాను, కాస్త జవాబు చెప్పాలిరా బుడుగూ."

"నువుకూడా ప్రెవేటు మాస్టరువేనా? ప్రశ్నలు అడుగుతానంటున్నావు. నా దగ్గర చాలామంది ప్రెవేటు మాస్టర్లు పని చేశారులే."

"ఏం, ప్రెవేటు మాస్టర్లు అంత చెడ్డ వాళ్ళా బుడుగూ?"

"చాలా ఆఆ లా? వాళ్ళకి అన్నీ తెలుసుకదా. మళ్ళీ ఏం తెలీనట్లు మనని అడుగుతారు. ముందస్తుగా చాక్లెట్లు తెస్తారు. నారాయణ కొట్లో పకోడీలన్నా తేరు. నాడు పది చాకెలెట్లు తెస్తే--వుత్తది-ఒకటో రెండో తెస్తారు. రెండు తింటే ఎన్ని వున్నాయంటారు. వాళ్ళకి పాఠాలు చెప్పడం రాదు పైగా ఈడుకి తగిన లెక్కలు చెయ్యమంటారు. చెప్పకపోతే నొంతి పిక్కలు తీస్తామంటారు. లాపోతే చెంకి జెల్లలు కొట్టుతారుగదా. అందుకే నేను ముందస్తుగా మేష్టర్లకి కొంచెం బోల్డు సలహాలిస్తాను. ప్రవేటుకి స్పెషల్ గది యిస్తానంటే వొద్దూ అని చెప్పూ అంటాను. వినకపోతే మీకే నష్టం. రోజూ రావద్దు.



ఓసారి తలనెప్పి అని. ఇంకోసారి జెరం అని (కడుపునెప్పి అనకూడదు అది పిల్లలకి రావాలి) ఎగగొట్టాలి. వేడి పకోడీలు తేవాలిగాని. చాక్లెట్లు వద్దు. ఏం, మరి యింకో సంగతి. ప్రవేటుకి వచ్చేముందు యిదివరకటి మాష్టరు బుడుగు చెవి 'కీ' ఎటు యిచ్చేవాడో తెలుసుకుని రావాలి. లాపోతే, ఇష్టం వచ్చినట్టు కీ యిస్తే చెవి పాడయిపోదూ-అందుకు."

"అందుకేనా ప్రెవేటు అంటే నీకు భయం?"

"ప్రవేటంటే నాకేం బయం? మాస్టర్లకే నేనంటే బయం. ప్రవేటు చెప్పడం అంటే తిటడం అని అర్థం. కొట్టడం అనికూడా వుంది. ఇగో, మరి ప్రవేటు చెప్పడంలో చాలా బోల్డురకాలు వున్నాయి గదా.

పొద్దున్నే బామ్మకి వంటకి కావలసినవి యివ్వకపోతే బామ్మ అమ్మకి

## వేమురాజు నరసింహారావు

ప్రవేటు చెప్పేస్తుంది. అమ్మ నన్ను యెప్పుడేనా కొడితే, నాన్న ప్రవేటు చెప్పేస్తాడు. నాన్నా బామ్మా కలిసి బాబాయికి అల్లరి చిల్లరిగా తిరుగుతున్నావని ప్రవేటు చెప్పుతారు. బాబాయి నాకు చెపుతాడుగదా.

అసలు ఈ బెద్దవాళ్ళు యెప్పుడూ ఏకీ సరిగా చెప్పరు. అదీ లోపం. అలా అని మనం అంటే కోపం.

ఇగో. ఓసారి యేమయిందంటే. నాన్న అమ్మ చెవికి కీయిస్తూ ప్రవేటు చెపుతున్నాడుగదా. అమ్మేమో నవ్వుతోంది గదా. అమ్మా ప్రవేటు అయిందా. అన్నం పెట్టుమగాని ఆకలేస్తోంది అన్నానా "ఛీ పోకిరి వెధవకానా" అంది కోపంతోను. నవ్వుతూనూ."

"మళ్ళీ ఆ సాయంత్రం ప్రవేటు మాష్టరు వచ్చి 'ప్రవేటు చెప్పుకుంటున్నావా బాబూ' అన్నాడుగదా. నేనేంచిన్నవాడినా. చితకవాడినా. వాడంతవాడు వాడు. నా అంతవాడు నేడు. నాకు వొళ్ళుమండి "ఛీ పోకిరి వెధవకానా" అనేశాను. అంతే. యింకేం అనలేదుగదా. అంతలోకి బాబాయి మొట్టికాయ వేసేశాడు బామ్మ ఆరి పిడుగా అంది. అమ్మ దిప్పకాయ వెదవా అంది. ప్రవేటు మాస్టరుకూడా ఆరి భడవా అనేశాడు.

ముందస్తుగా వీడు మేష్టరు అని చెప్పకపోతే ఎవరికేనా ఎలా తెలుస్తుంది? నేను మంచివాణ్ణి కాబట్టి. ఆ మేష్టరు చేత మూడ్రోజులుదాకా ప్రవేటు చెప్పించాను? ఈ మేష్టర్లంతా అబద్ధం చెప్పుతారు నన్ను భరించలేరని. భరించడం అంటే మొయ్యడం అని బాబాయి చెప్పారు. నేను వాళ్ళమీద సవారీ చేస్తానని అనకుండానే అలా అనడం అన్యాయం కాదూ అని అడుగుతున్నాను.

అయితే అన్యాయం అని తెలీదు వాళ్ళకి. అపార్థం తెచ్చుకున్నారన్నమాట. అంటే కోపం తెచ్చుకోడంట. అయితే మరి పిల్లలు ఎంత అపార్థం తెచ్చుకోవాలి?

అదుగో బాబాయ్-రెండు జడల సీత వెళిపోతోందికోయ్ — మీరు లాపోతే బుడుగూ బుడుగూ ఈలవేసి పెద్దిరా—ఎయ్ పిల్లా అని పిలవరా—అని ఎంతో బతిమాలుతారు. రెండు జడల సీత నన్ను చెంకి జెల్లలు కొడితే బయపడిపోతాడు. అయినా నేనే మళ్ళీ రప్పిస్తాను.

"ఇగో—ఓసారి గోపాళం అద్దం పగలగొట్టాడు గదా అమ్మ ప్రవేటు చెప్పుతుందని హడలిపోయాడు



గదా నాన్న. నాన్నని ఎలాగేనా రక్షించాలి అని అమ్మతో నేనే పగలగొట్టానని చెప్పు తాను గదా నాన్న మనకి కాణీయో పద జాలో యిస్తారు."

బాబాయి, యింకో పది బాబాయిలు బీచి దగ్గర రెండు జడల సీత దగ్గర అను మానం అయిపోతే నేనే రక్షించాలి గదా. బాబాయి. సీతకి లౌలెట్రు రాసి పట్టుగెళ్ళి యిచ్చిరారా అన్నాడా, నన్ను సీత నాన్న గభుక్కుని పట్టేసుకుని ఉత్తరం లాగేసు కున్నాడు హేం పోగురు రాస్కెల్. నా కూతురికి ఉత్తరం రాస్తాడా– చెప్తాను. అన్నాడుగదా. బాబాయిమీద జాలేసి




ఎలాగైనా రక్షించాలి అని "ఉరే, సీత నాన్నా-మరేం-ఆ వుత్తరం బాబాయి కాదూ నేనే రాశా ఓచ్చి" అనేసి పరుగేత్తుకెళ్ళి పోయా. అందుకు బాబాయికి బోల్డు అను మానం అయిందిగదా. చివరికి నీమూ లాన్నే అని నన్ను కొడతాడు!

అలాగే పక్కింటి లావుపాటి పిన్ని గారి మొగుడు నాన్నతో కబుర్లు వేసుకుని బీడీలు కాలుస్తాడా, మనం పిన్నిగారికి చెప్పకూడ దన్నమాట, అది.

అబద్ధం చెప్పు అని, ఈలవేసి పెట్టు అనీ, అంటారా. అర్థణా, కాణీయో, పద జాలో యిస్తారు. నిజం చెపితే కొట్తేస్తారు. అసలు ఈ బెద్దవాళ్ళంతా యింతే అని నాకు అనుమానం కలుగుతుంది అప్పు డప్పుడు!

"అయితే పెద్దవాళ్ళమీద నీకు కోపం. అవునా?"

"అప్పుడప్పుడు రౌడీ రాస్కెల్. భడవా కానా. అని తిట్టినా, మొట్టికాయలు వేసినా, మా రాధకి, గోపాళంకి నేనంటే యిష్టం కదా. నిద్రపోయేటప్పుడు ముద్దొస్తానుట. అందుకు బామ్మ యెప్పుడూ నా పార్టీయే, బామ్మోయ్, గిల్లేస్తున్నాడేవ్ అని పెద్దగా అరిస్తే చాలు. బామ్మ వచ్చేసి ప్రవేటు మాష్టరుకి ప్రవేటు చెప్పేస్తుంది.



మా గోపాళంకి అమ్మ నవ్వినా. కోపం వచ్చినా బాగుంటుంది కదా నాన్న యెప్పుడు అమ్మ పార్టీయే రాధకిగోపాళం "అభిమాన ఆశ్యనటుడు" గదా. నాన్న యేమన్నా అమ్మ నవ్వుతూనే వుంటుంది అందుకు.

ఏం ఓసారి ఓ ప్రవేటు మాష్టరు దీపా వళి అంటే ఏంట్రా బుడుగూ అని బతి మాలాడుగదా, చెప్పకపోతే ప్రవేటు చెప్పే శాడుగదా బామ్మ ప్రవేటువాడికి ప్రవేటు చెప్పేసింది. బాబాయొచ్చి "అన్న బామ్మా" అని బామ్మకి ప్రవేటు చెప్పాడు. నాన్నవచ్చి "వెదవ కానా. అమ్మని కోంటకతావురా" అని బాబాయికి ప్రవేటు చెప్పాడు. బామ్మేమో "కుర్ర వెదవ వాణ్ణెందుకు తిడతావురా" అని నాన్నకి ప్రవేటు చెప్పింది. "ఉరేయ్ గోపాళం, నువ్విలా రండి" అని అమ్మ నాన్నకి ప్రవేటు చెప్పేసింది. మేష్టరు హడిలి పోయాడు.

ఏం - బాబాయికి కూడా నేనంటే యిష్టమే కదా. రెండుజడల సీతలు వస్తే ఈలవేసి పెట్టుతానుగా. అందుకు బాబా యికి అట్లతద్దికి సీతలే.

దసరాకి సీతలే.
సంకురాత్తిరికీ సీతలే.
భోఘిమంటకిసీతలే.
అన్నింటికి సీతలే వాడికి.
పిచ్చి బాబాయి.



"గుళ్ళో దేవుడుంటా డురా. రెండుజడల సీతలు కాదురా పిచ్చాడా" అంటే 'పిచ్చివెధవా-నా కళ్ళు పెట్టుకు చూడరా.

నీకు బళ్ళోను, గుళ్ళోను, రాయిలోను. రచ్చలోను, అన్నిటిలోనూ రెండుజడలసీతలేకనిపిస్తాయి "అంటాడు. అంతా అబద్ధం. వాడి కళ్ళజోడు పెట్టుకు చూశాను. సీతాలేదు. పీతా లేదు"

"అయితే నువ్వెపుడు బళ్ళోకి వెళు తున్నావురా"

"ఇంకా నేనిప్పుడు బళ్ళోకి వెళుతున్నా వురా లేదు. అందరు నన్ను బళ్ళో పడెయ్యా టానికి చూశారు కదా కాని నన్నెవరూ బళ్ళో పడేసుకోలేదు. నేను అల్లరిమానేసే దాకా బళ్ళు మూసేశారుట. అందుకు బళ్ళు తెరిచేదాకా మనం అల్లరి మానెయ్యాలన్న మాట బాబాయ్ చెప్పాడు.

మనం అల్లరి చేస్తే ఒద్దురా అని తిట్టుతారా. సరే పోనీ పాపం అని జాలి పడి మూడ్రోజులో. పది నెల్లో అల్లరి మానేశా నాన్న హడిలిపోయాడు. బయ పడిపోయాడు చిన్నపిల్లలయితే ఉత్తినే పడిపోతారు. పెద్దవాళ్ళు బయపడిపోతారు. హచ్చెరపడిపోతారు.

నాన్న అన్నాడు గదా. వీడు అస్సలు అల్లరి చెయ్యటంలేదే రాధా. ఒంటో బావు లేదా" అన్నాడు "దిష్టి తగిలిందేమో నండీ" అంటుంది రాధ

మనం అల్లరి చేస్తేనే వాళ్ళకి చాలా యిష్టం అని నా అనుమానం.

"నీకేం భాషలు వచ్చురా బుడుగూ."

"ఓ—నాకు చాలా భాషలు వచ్చు-ఉంగా




భాష పాపాయిలకి తెలుగు రాదుకదా ఉంగా భాషలోనే మాట్లాడుతారు. తెలుగు రాకపోతే పాపాయికి కోపం వచ్చిందని వాళ్ళ రాధకి ఎలా తెలుస్తుంది మరి.

అందుకని అందరికి తెలుగురావాలి అని నా అయిడియా. ఇంకా నా దగ్గర అయిడి యాలు చాలా ఉన్నాయి. మా బాబాయి దగ్గరకూడా బోల్డు ఉన్నాయి.

# సీ ఘర్ సీగానపెసూనాంబ!



ఇంకా, పిచ్చికభాష, చికభాష, కభాష, భాష, ష- ఎన్నోవచ్చు- సిబిపాటం, పద మూడో ఎక్కంకూడా వచ్చు తెలుసా. సీరాముని దయచేతనుకూడా వచ్చు.

చదూ సంజెలు లేకపోతె ఎల్లా. సీ గాన పెసూనాంబతో పెళ్ళిచెయ్యరుగా. అందు కని మనం చదూకోవాలన్నమాట

"అయితే బుడుగూ, నీకిష్టమైన దేంట్రా?"

నాకిష్టమైనది కుంచెం చాలా ఉన్నాయిరా.

ఒకటి— మా రాధ.

రెండు— గోపాళం.

అయిదు— బామ్మ. ప్రవేటు మాస్టర్లకి ప్రవేటు చెప్పుతుందికదా. బేడీలు మీద పడేస్తానని బెదిరిస్తే. కాణీయో వంబిడియో యిస్తుందిగదా. బామ్మ పిలుస్తోందని రోజుకి పదిసార్లయినా జటకా ఎక్కి యింటికి రావచ్చుగదా అందుకు.

పది— బాబాయి నా చేత యీల వేయించుకునే— పాపం వాడికి ఈలవెయ్యడం రాదుగదా- లౌ లెట్రులు యిచ్చిరారా అంటాడు కదా. కాణీయో పదణాలో యిస్తాడు సుబ్బలచ్చిమి ముఖం బాబాయి కిష్టం. మా బాబాయంటే నాకిష్టం- అందుకు.

ముప్పై— నిజెం జటకాబండి. జటకా తోలడానికి నా దగ్గర బీడిలు ఉన్నాయిగదా. చెవులో పెటుకోడానికి. కాల్చడానికి కాదు. బామ్మ ఒత్తుల పెట్టెలో అవి దాచుకుంటానుకదా. నా దగ్గర నిఝెం కొరడా కూడా వుంది.

డెభై — రైలింజను. బెద్దవాణ్ణయాక రైలింజను తోలుతాను కదా.

నూరు— సీ గాన పెసూనాంబ. ఆద మెడ్రాస్ రైలు పెట్టెలో లావుపాటి పిన్నిగారు మా గానపెసూనాంబని పెళ్ళాడుతావురా అందికదా. నేను పెళ్ళాడతాను లెండి అని చెప్పేశాను కదా అందుకని.

"ఒరే, ఆ డిక్టీవువాడు మళ్ళీ కనిపించాడురా?"

"డికిష్టివాడు మళ్ళీ రాలేదుకదా. మరి మా ఇంట్లో శవాలు, రక్తం లేందే వాడు డికిష్టి చెయ్యలేడుకదా. బామ్మ ఒత్తుల పెట్లో నూరు రూపాయిల నోటు దాచుకుంటే వీడు శవం ఏదీ. రక్తం ఎక్కడ అంటాడు కదా. ఆ ఎలక్షన్ వాడొచ్చి మీ ఓట్లు నాకే అన్నాడు, వాడికి ఓటు నాన్న వేస్తే నేను సుబ్బరంగా జటకా తోలుకోవచ్చుట.

ఇంతలోకే రెండు జడల సీత వచ్చి- యించక్కా వుంటుందిలే- మీ ఓటు మాకే యిస్తారు గదాండీ అంది. వో- నా ఓటు



మా అమ్మ ఓటు. అన్నదీ. వదిన దీ. పక్కింటి వాళ్ళదీ, ఊరివాళ్ళ ఓటులన్నీ మీకే యిచ్చేస్తాను అన్నాడు కదా బాబాయి. యిలా డానుసు చేసేసి. కాళ్ళు చేతులు ముడివేసుకుని అప్పుడు నేను కూడా ఓటిస్తాను అన్నాను. సీత సరేనని ఒంగి నన్ను ముద్దు పెట్టుకుంది కదా. నా ఓటు కూడా తీసుకోండి అన్నాడు బాబాయి. ఓటంటే ముద్దుట. బాబాయి చెప్పాడు.

"నీలాటివాడే యిదివరకు మెడ్రాసులో డుంబూ అనేవాడు వున్నాడు. నీకు తెలుసా?"

"ఏమో—వెంకట రమణని అడుగు పోవాయ్"

"అమెరికాలో డెన్నిస్ అని నీలాగే ఓపిడుగు వున్నాడు. వాడు తెలుసా పోనీ?"

"అమెరికావాళ్ళు పడుకుంటే మనం లేవాలిట మనం పడుకుంటే వాళ్ళు లేవాలన్నమాట. బాబాయి అలా అని చెప్పాడులే మరి నేను పడుకున్నపుడు లేచేవాడి సంగతి నాకెలా తెలుస్తుంది?

అస్సలు నేను యిల్లా చిన్నవాడుగానే వుండిపోవాలిట. అప్పుడే నేను ముద్దొస్తానుట. మా బాబాయి అంటాడులే. పెద్దయిపోతే "గాడిద పిల్ల కోమలం" అంటాడు. అంటే నాకూ తెలీదు. "జాటర్ ఢమాల్" అన్నమాట. అ జాటర్ ఢమాల్ అంటే అర్థంలేదూ అంటాడు నాన్న. అర్థం చేసుకోవాలి అంతే—జాటర్ ఢమాల్ అంటే అర్థంలేదూ అని అర్థం అన్నమాట.

అయితే నేను గభుక్కుని బెద్దవాణ్ణి అయిపోవాలి లాపోతే. అల్లరి చెయ్యరా అని చెప్పి చేస్తే నడ్డిమీద దంపేస్తారు. అప్పుడు పసిలాంటివాళ్ళని మనం రపించవచ్చుకదా. అందుకు యింకా. సీ గాన పెసూనాంబని పెళ్ళాడుతావురా కదా.

"అది సరేగాని. మీరు తీయించుకున్న ఫొటోలో లావుపాటి పక్కింటి పిన్నిగారి బొమ్మ సగమే వుందిగదా. మరి సీ గాన పెసూనాంబ ఎట్లా వచ్చింది"

"లాపోతే బాబాయి తలకాయ పోతుందని లావుపాటి పక్కింటి పిన్నిగార్ని సగమే తీశాడు ఫొటోవాడు. మిగిలినసగం పిన్నిగారు బయట వుందన్నమాట. సీ గాన పెసూనాంబ సంగతి మా వెంకట రమణనే అడుగురా.

ఒరేయ్. మళ్ళీ వచ్చేటప్పుడు నిజెం

## మర్చిపోకు రోయ్!



జటకా బండియో. రైలింజనో తేవడం మర్చిపోకురోయ్"